క్లుప్తంగా

బీటీ రహదారిగా మారేదెన్నడో?



అమరచింత: మండల కేంద్రం నుంచి మస్తీపురం గ్రామానికి వెళ్లడానికి వీలుగా ఉన్న కచ్చ రహదారిని బీటీ రహదారిగా మార్చమని గత పాలకులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఇరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అమరచింత బీసీ కాలనీలోని పద్మశాలి భవనం నుంచి మస్తీపురం గ్రామానికి అడ్డదారి తాతల కాలం నుంచి ఉందన్నారు. కేవలం మూడు కిలో మీటర్ల దూరంలో మస్తీపురం గ్రామానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. గద్వాలకు చేరుకునేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని పాలకులు, అధికారులు స్పందించి కచ్చ రహదారిని బీటీ రహదారిగా మార్చి రైతులతో పాటు ప్రయాణికుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాలాపురం గ్రామంకు చెందిన క్యాతూరి చింతలయ్య అనారోగ్యంతో మృతి చెందా రు. విషయం తెలుసుకున్న జిల్లా బీజేవైఎం అధ్యక్షులు అనుజ్ఞారెడ్డి ,స్థానిక నాయకులతో కలసి మంగళవారం గ్రామంలో మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్ర మంలో మండల బీజేపి అధ్యక్షులు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్దన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నందికోళ్ల సేవ



కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో గల సుందరగిరి గుట్టపై వెలిసిన పరమేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులతో కలిసి నందికోళ్ల సేవ నిర్వహించారు. నందికోళ్ల సేవలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి భక్తిని చాటుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి జాతరలో ఏర్పాటైన గుడారాలతో సందడి నెలకొంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెకుముఖి ప్రతిభ పరీక్ష



పెబ్బేరు రూరల్: పాఠశాల స్థాయి చెకిముఖి టాలెంట్ పరీక్షను మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేణాచారి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించొచ్చని, వారిలో శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనా శక్తి, సైన్స్ అధ్యయనానికి ప్రోత్సహించడానికి, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి టాలెంట్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఎస్ విజయకుమార్, గోవర్దన్‌రెడ్డి, రాంప్రసాద్, మల్లికార్జున్, నరేందర్‌గౌడ్, నాగన్న, రాజశేఖర్‌గౌడ్, వరలక్ష్మి, పీఈటీ ఇందిర, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

కొల్లాపూర్ రూరల్: అటవీ సంరక్షణపై అందరి బాధ్యత అని ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నల్లమల అటవీ సంరక్షణపై మొలచింతపల్లి, నార్లాపూర్ గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్ల, పశువుల కాపరులు, రైతులు అగ్గిపెట్టితో అటవీ ప్రాంతంలోకి ప్రవేశించొద్దన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివమాలధారులు అటవీ మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

‘పల్లెవెలుగు’ కానరాదే!

- బీటీ రోడ్డు ఉన్నా.. ఆర్టీసీ బస్సులకు నోచుకోని గ్రామాలు
- గ్రామస్తులు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- నేటికీ 12 గ్రామాలకు ప్రజారవాణా కరువు



తెల్లరాళ్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

పాన్‌గల్: నేటికీ ఆర్టీసీ బస్సులు నడవని గ్రామాలు ఉన్నాయంటే అతియోశక్తి కాదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నా ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు మండలంలో ఉన్నాయి. దీంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు, అవి సమయానికి లేకపోతే కిలో మీటర్ల మేర ప్రధాన రోడ్డుకు కాలినడకన వెళ్లాల్సిందే. గతంలో కొన్ని రోజులు ఆర్టీసీ బస్సులు నడిపినా.. ప్రయాణికులు ఎక్కడం లేదనే సాకుతో ఆర్టీసీ అధికారులు కొన్ని గ్రామాలకు బస్సులను రద్దు చేశారు. ఆయా బస్సులను పునరుద్ధరించాలని పలుమార్లు విద్యార్థులు, గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించినా.. కేవలం హామీలు ఇస్తున్నారే తప్పా పల్లెలకు బస్సు రావట్లేదు.

మండల పరిస్థితి..

మండలంలోని గోప్లాపూర్, కిష్టాపూర్, కిష్టాపూర్ తండా, దావాజిపల్లి, దొండాయిపల్లి, శాగాపూర్‌తండా, దావాత్‌ఖాన్‌పల్లి, మంగళ్లపల్లి, ఆకునోనిపల్లె, ఆకునోనిపల్లెతండా, మల్లాయిపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం, బహుదూర్‌గూడెం గ్రామానికి సీసీ రోడ్డు ఉన్న ఆయా గ్రామాలకు బస్సులు నడవటం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు ప్రతి నిత్యం నాల్గు, ఐదు కిలో మీటర్ల మేరకు కాలినడకన వెళ్తున్నారు. ఒక్కొక్కసారి తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

ఉచిత బస్సు సౌకర్యానికి మహిళలు దూరం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యానికి మహిళలు, విద్యార్థినులు దూరం అవుతున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ఉచిత బస్సు సౌకర్యానికి నోచుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచే విధంగా ఇటూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

బీటీ రోడ్డు ఉన్నా..



మా గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు రాదు. ఏళ్లుగా బస్సు కోసం ఎదురుచూస్తున్నా అధికారులు ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే 4 కి.మీ. దూరం వరకు నడవాల్సిందే.

– నాగేశ్వర్‌నాయుడు, సర్పంచ్, దావాత్‌ఖాన్‌పల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా అధికారులు ఆర్టీసీ బస్సులను నడపకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు ఎక్కలాంటే 4 కి.మీ. దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సిందే . ప్రతి నిత్యం మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాల, కాలేజీకి వెళ్లాలంటే విద్యార్థులకు అవస్థలు తప్పట్లేదు.

– కొంకల మోహన్, విద్యార్థి, దావాత్‌ఖాన్‌పల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో బీటీ రోడ్డు ఉన్నా ఆర్టీసీ బస్సులు నడవని గ్రామాల వివరాలను జిల్లా, ఆర్టీసీ అధికారులకు నివేదించాం . ప్రయాణికులు ఎక్కడం లేదనే సాకుతో బస్సులను నడపడం లేదని, ఈ విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించాం. మరోమారు బస్సుల పునరుద్ధరణపై ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తాం.

– రఘురాములు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, పాన్‌గల్

విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించేందుకు పోటీలు



ఖిల్లాఘనపురంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంఈఓ తదితరులు



వనపర్తిలో..

వనపర్తి టౌన్: విద్యార్థులకు జీకే పోటీలు నిర్వహించడం ద్వారా వారి మేధస్సు పెరుగుతుందని, చురుకుగా ఉంటారని క్లాస్‌మేట్ క్లబ్ నిర్వాహకులు రవి శంకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలురు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి జీకే టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు అభినందన పత్రం, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తారాబాయి, క్లాస్‌మేట్ క్లబ్ కన్వీనర్ జ్యోతి, నరేష్‌కుమార్, సరస్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మండల స్థాయి జీకే టాలెంట్ టెస్టు నిర్వహించారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెస్టులో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి నాల్గో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను గుర్తించి వారికి నగదు పురస్కారంతో పాటుగా ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథం, క్లబ్ సభ్యులు నవీన్‌కుమార్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు

పెంట్లవెల్లి: పల్లెల్లో పచ్చదనం, అటవీ విస్తరణ కోసం గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఊరూరా మొక్కలు నాటారు. గుట్టలు, రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రోడ్లకు ఇరువైపులా అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. అంతాబాగాను ఉన్న ప్రస్తుతం నాటిన మొక్కలు ఎండుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ప్రభుత్వం ఎన్నో రూ.కోట్ల నిధులు వెచ్చించి మొక్కలు నాటితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా, రోడ్డు ఇరువైపులా ఎండిపోయిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. రక్షించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కలు కాపాడటంతో అధికారుల, పాలకులు పూర్తిగా విఫలం అయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.



2021–22 సంవత్సరంలో 50 వేల మొక్కలు, హౌసింగ్ పర్ప స్‌లో 40 వేల మొక్కలు 2022–23లో 30 వేల మొక్కలు, హౌసింగ్ పర్ప స్‌లో 40 వేల మొక్కలు, 2023–24లో 20 వేల మొక్కలు, హౌసింగ్ పర్ప స్‌లో 40వేల మొక్కలను మండలానికి అందాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నర్సరీలలో పెరుగుతున్న మొక్కలు తప్పా రోడ్ల వెంట మొక్కలు కనిపించని దుస్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు, సర్పంచ్‌లు వచ్చే హరితహారం కార్యక్రమంలో నాటే మొక్కలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేతాజీ స్ఫూర్తి మరువలేనిది



వనపర్తిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఆజాద్ హిందూ ఫౌజ్ స్థాపించి, ప్రత్యేక సైన్యంతో భారతదేశ బానిస సంకెళ్లను తొలగించడానికి అహర్నిశలుగా కృషి చేసిన సుభాష్ చంద్రబోస్ పోరాటాలు, దేశ సేవ మరువలేనిదని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కొనియాడారు. మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, డీసీసీ కార్యాలయం, బీజేపీ జిల్లా కార్యాలయంలో, టీజేఏసీ ఆధ్వర్యంలో, పాలిటెక్నిక్ కళాశాలలో, అమరచింతలోని జెండాకట్ట, పెబ్బేరు చౌరస్తాలో ఆయన చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములుయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, లక్కాకుల సతీష్, కౌన్సిలర్ బ్రహ్మం, రాజారామ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..



బీజేపీ జిల్లా కార్యాలయంలో..



అమరచింతలో..

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాన్‌గల్: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ రఘురాములు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి హాజరయ్యే అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆయన సూచించారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ: కేసు నమోదు

గోపాల్‌పేట: మండల పీఎస్‌లో మంగళవారం ట్రాక్టర్ ట్రాలీ దొంగతనానికి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పేట బంగారమ్మగడ్డ కాలనీకి చెందిన బోడి శ్రీనివాసులుకు చెందిన ట్రాక్టర్ ట్రాలీని బుద్దారం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో నిలిపాడు. మంగళవారం తెల్లవారుజామున చూస్తే ట్రాలీ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీ విలువ సుమారు రూ.రెండు లక్షల డెబ్బై వేలు ఉంటుందని బాధితుడు చెప్పినట్లు ఎస్ఐ వెల్లడించారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించాలి

పెద్దకొత్తపల్లి: పోస్టల్ సేవలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలి సబ్ పోస్టుమాస్టర్ రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పోస్టాఫీసుల్లో ఉన్న పొదుపు ఖాతాలను గురించి ప్రజలకు వివరించి వారి నుంచి ఖాతాలను తెరిపించాలన్నారు. సుకన్య సమృద్ధి యోజనా, రికవరీ డిపాజిట్లు, సేవింగ్ బ్యాంక్, తపాలా బ్యాంకు పొదుపు ఖాతాలను ఎక్కువ శాతం సేకరించాలన్నారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ నూతన భవన సముదాయ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 40 ఏళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతుంది. దీంతో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ భవన నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేయించారు. నవంబర్‌లో పనులు ప్రారంభించగా ప్రస్తుతం పనులు ఊపందుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో ముగిసిన ఉర్సు

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామ శివారులోని గుట్టలపై వెలసిన శ్రీసయ్యద్ షా హాజీమలాంగ్ బాబ ఉర్సు మంగళవారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగుతున్న ఉర్సు వేడుకలు మంగళవారం ఖత్మేఖురాన్ ఫాతేహా నిర్వహించారు. ముర్షద్ మైనోద్దీన్ ఆధ్వర్యంలో దర్గా షరీఫ్‌కు వస్తున్న భక్తులు భక్తిశ్రద్ధలతో దర్గాకు చాదర్లను సమర్పించారు. దర్గా ప్రాంగణంలో పొటేళ్లను బలిచ్చి కందూర్‌లు నిర్వహించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం జరగాల్సిన కందూర్‌ల వేడుకలు అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠతో భక్తులు, దర్గా నిర్వాహకులు వాయిదా వేశారు. మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు కళకళలాడాయి. దర్గాకు వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించామని నిర్వాహకులు తెలిపారు.



ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

పాన్‌గల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రసవాల సంఖ్యను పెంచేలా సిబ్బంది కృషి చేయాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా గర్భిణుల నమోదు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడం, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం చేయించడం, హైపర్ టెన్షన్ డయాబెటిస్ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడటం, శ్వాస కోశ వ్యాధులు ఉన్న చిన్నారులను గుర్తించి వారికి చికిత్స చేయించడం, అనీమియా లక్షణాలు ఉన్న గర్భిణులను గుర్తించి వారికి హిమోగ్లోబిన్ శాతం పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సేవల విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



నవీన్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టణ కేంద్రానికి చెందిన మొద్దు నవీన్‌రెడ్డిని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీధర్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని దేవరద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి నవీన్‌రెడ్డికి అందజేశారు. తనపై నమ్మకం ఉంచి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం, అందుకు కృషి చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి, స్థానిక కాంగ్రెస్ నాయకులకు నవీన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని నవీన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, ఎన్ఎస్‌యుఐ మండల్ ప్రెసిడెంట్ దిలీప్ రెడ్డి, శ్రీకర్, సూర్య, పవన్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు

పాన్‌గల్: మండలంలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటిపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని, దీంతో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి ఆయా వివరాలను సంబంధిత అధికారులకు అందించాలని ఆదేశించారు. వేసవి కాలానికి ముందుగానే చర్యలు తీసుకుంటే తాగునీటి సమస్య అధిగమించవచ్చన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



రాంపురంలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేసి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింధూజ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని రాంపురంలో ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పలు వ్యాధులపైన ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బస్వరాజు, వైద్యాధికారులు రాజశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బుసిరెడ్డిపల్లిలో..

‘ధర్మ రక్షణే బీజేపీ అజెండా’



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: దేశ స్వాతంత్ర్య అనంతరం ఐదు దశాబ్దాలు అధికారంలో ఉండి అయోధ్యలో ఆలయ నిర్మాణాన్ని పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ రోజు శాంతి భద్రతలో నేపథ్యంలో అస్సాంలో రాహుల్‌గాంధీ జోడో యాత్ర మార్గాన్ని పోలీసులు మార్చారని, దానిపై కాంగ్రెస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో రాముడి ప్రాణప్రతిష్ఠ న్యూస్ రావొద్దని కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకులపై దాడులు, అల్లర్లకు పాల్పడ్డారని వివరించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ దేశం కోసం, ప్రజల అభ్యున్నతికి పనిచేస్తుందని గుర్తుచేశారు. బీజేపీ గుండాలు కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడి చేశారని మాజీ మంత్రి చిన్నారెడ్డి కొవ్వత్తులతో నిరసన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు సీతారాములు, సుమిత్రమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, నాయకులు గోర్ల బాబురావు, ప్రవీణ్, కొమ్ము సామేల్, రాములు పాల్గొన్నారు.